

# మళ్లీ చెప్పిన కథలు

— రావికొండలరావు

## సింహం-కుందేలు

ఒక మహారణ్యాన్ని పాలిస్తున్న సింహం, మామూలు సింహం కాదు. దర్పం, డాంబికం, క్రౌర్యం, నియంతృత్వం వంటి సుగుణాలు గల సింహం. ఆ సింహానికి ఆశ ఎక్కువ; ఆకలీ ఎక్కువ. పక్క అరణ్యం మీద దాడి చేసి జయించి దానికీ రాజు కావాలని ఆశ. కనిపించే ప్రతి జంతువునీ కబళించడం-ఆకలి. తనకి ఆకలి తీరినాతీరకపోయినా

అరణ్యంలో జంతువుల్ని అదేపనిగా చంపడంతో అరణ్యంలో జంతు సంఖ్య పల్చబడ సాగింది. "వన్యమృగ రక్షణ చెయ్యండహో!" అని జంతువులన్నీ అరిచి గీ పెట్టినా అది అరణ్య రోదనమే అయింది. ఇహ లాభం లేదని ఓ రోజు జంతువులన్నీ సమావేశమై ఒక తీర్మానాని కొచ్చాయి. తన ఇష్టం వచ్చినట్టుగా రాజు జంతువుల్ని చంపడం భావ్యం కాదనీ, రోజుకో జంతువునే చంపాలనీ, ఒక క్రమంలో ఒక్కో జంతవు తమంతట తామే వచ్చి, బలి అవుతాయనీ రాజా వారికి చెప్పాలని నిశ్చయించుకున్నాయి. "జంతు స్వామ్యం" లక్ష్యాల్ని రూపొందించి, అన్నీ కలిసి "అడవేగింపు" చెసుకుంటూ మృగరాజు దగ్గర కెళ్లి తమ తీర్మానం విన్నవించుకున్నాయి. అలా ఐకమత్యంతో అన్ని జంతువులూ కలిసికట్టుగా 'ఏకతాడు' మీద రావడం చూసి మృగరాజు భయపడ్డాడు. ఆ భయంతో తనకి రోజూ ఆహారం లభిస్తుందిగదా, చాలనుకుని 'సరే' అన్నాడు. మృగరాజావారికి జంతువులన్నీ జయజయధ్వానాలు సల్పి "జంతు స్వామ్యం వర్థిల్లాలి" అనీ, "జంతు జాతీయ సమైక్యం-వర్థిల్లాలి" అనీ నినాదాలు చేస్తూ వెళ్లిపోయాయి. అక్కడి నుంచి రోజూ చీటిలు వేసుకోడం, ఆ చీటీలు అందరూ తియ్యడం, ఎవరి చీటీలో "బలి" అని వుంటుందో, ఆ జంతువు సింహం దగ్గరకెళ్లడం-చావడం! అదీ నియమావళి. ఆ ప్రకారం రోజూ ఒక్కో జంతువు సింహం దగ్గరకెళ్లి ఆత్మార్పణ చేసుకోసాగాయి. ఓ రోజు 'బలి' చీటీ, వయసులో వున్న కుందేలుకి వచ్చింది. ఆ కుందేలు బయల్దేరుతూ వుంటే తక్కిన బంధువర్గం, మిత్రవర్గం భోరుమన్నాయి. "బెంబేలు పడకండి ఈ కుందేలు బంధు మిత్రులారా! భయపడకండి. నా తెలివి తేటలుపయోగించి తప్పించుకుని రావడానికి ప్రయత్నిస్తాను" అని ధైర్యం చెప్పి బయల్దేరింది. ఎలాగైనా తాను సింహం నోటికి అందకుండా తప్పించుకోవాలి. తక్కిన జంతువుల్ని కూడా రక్షించాలి! దానికి ఉపాయం ఏమిటా అని ఆలోచిస్తూ, వెళ్తున్న దార్లో ఒక బావి వుంటే ఆ గట్టు ఎక్కి కూచుంది. కూచుని బావిలోకి తొంగిచూసింది. పాడుబడిన బావి అయినా అందులో నీరుంది. ఆ నీట్లో తన ముఖం కనిపించింది. "ఆహా" అనుకుంది కుందేలు. "దివ్యమైన ఆలోచన" అనుకుంటూ ధైర్యంగా సింహం దగ్గరకెళ్ళింది. వేళకి రాలేదని 'ఆకలిగొన్న సింహం'లా వున్నాడు రాజు. కుందేల్ని చూసి గర్జించి, "ఏం ఇంత ఆలస్యం?" అని గద్దించాడు.

"ఏం చెప్పను ప్రభూ! ఎప్పుడో బయల్దేరాను తమ దగ్గరికి... కాని ఎలా చెప్పను నియంతా..."

"అయ్! నియంతా!"

"అహహ... నీ యంత సింహం ఇంకొకటి దార్లో కనిపించి, నన్ను అటకాయించి..." అని కుందేలు చెప్పబోతూవుంటే, సింహం భయంకరంగా అరిచింది. ఆ అరుపుకి జంతువులు, చెట్లూ గడగడలాడాయి.

"నాయంత సింహమా! ఇంకో సింహమా! నేను ఏలుతున్న ఈ రాజ్యంలో 'ప్రతిపక్షం' లాగా వేరొక సింహమా! ఎక్కడుంది చెప్పు! నిన్నూ, దాన్ని కలిపి తింటాను. చెప్పు" అని హూంకరించింది సింహం.

"ప్రభూ! అక్కడొక బావి వుంది. అందులో దాగుంది" అంది కుందేలువాయు, శబ్ద, కాంతి వేగాలతో పరుగెత్తింది సింహం- బావి దగ్గరకి- కుందేలు వెంటరాగా. "లోపలికి చూడండి స్వామీ" అంది కుందేలు అతి వినయంగా. మృగరాజు గట్టెక్కి బావిలోకి తొంగి చూశాడు. నీళ్లలో తన నీడ కనిపించింది. తన నీడ అని తెలియక, తనలాగే వున్న ఆ నీడ సింహాన్ని చూసి గంభీరంగా గర్జించాడు. ఆ నీడ కూడా గర్జించింది. "ఓరీ- సింహాధమా! నా మీదనే గర్జిస్తావా! నీకు చావు మూడె! చూడు నా దెబ్బ" అని నీళ్లలోకి దూకింది సింహం. అంతే! టపటపా కొట్టుకుని ఊపిరి అందక మునిగిపోయి చచ్చింది!

కుందేలు పరీక్షగా చూసి, తేల్చుకుని- "అమ్మయ్య! పీడా విరగడైంది. నా జాతిని రక్షించాను. నా జాతినే కాదు- జంతు జాతినే రక్షించాను. నా పథకం పారింది. నాకూ జై, నాకూ

